క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


నెయ్యి ప్యాకెట్లు అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

పెందుర్తి: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి ఆకాంక్షించారు. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ పథకంలో భాగంగా పెందుర్తి మండలం చింతలగ్రహారానికి చెందిన మళ్ల వెంకటలక్ష్మి ఏర్పాటు చేసిన నెయ్యి ప్యాకెట్ల తయారీ కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా శక్తిని చాటాలని పిలుపునిచ్చారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబమంతా ఎదుగుతుందన్నారు. ఏపీడీ వెంకటరమణ మాట్లాడుతూ పీఎంఎఫ్‌ఎంఈ పథకంలో భాగంగా నెయ్యి ప్యాకెట్ల తయారీకి 35 శాతం సబ్సిడీ అందించినట్లు తెలిపారు.

వృద్ధురాలికి వైద్య సేవలు


వృద్ధురాలి వివరాలు తెలుసుకుంటున్న మమత

విశాఖ విద్య: నిస్సహాస్థితిలో రహదారి పక్కన పడిఉన్న వృద్ధురాలికి మమత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. గురువారం 104 ఏరియాలో ఒంటిమీద బట్టలు లేకుండా రహదారి పక్కనే వృద్ధురాలు పడిఉందనే సమాచారం తెలుసుకున్న మమత ఎయిర్‌పోర్టు కానిస్టేబుల్ కోటేశ్వరరావు సహకారంతో అక్కడికి వెళ్లారు. వృద్ధురాలికి దుస్తులు వేసి, సపర్యలు అందించిన అనంతరం ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. పెందుర్తిలో ఉండే కూతురు ఇక్కడికి తీసుకొచ్చి వదిలివెళ్లిపోయినట్లుగా చెప్పటంతో ఆ వృద్ధురాలిని వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అనంతరం కుటుంబీకుల చెంతకు చేర్చేలా తగిన బాధ్యతలు తీసుకునేందుకు ముందుకొచ్చిన మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు మమతను పలువురు అభినందించారు.

జిల్లా ప్రగతిపై సదస్సు నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఏయూ అలుమ్ని హాలులో 'ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి–విశాఖపట్నం జిల్లా ప్రగతి'అనే అంశంపై సదస్సు జరగనుంది. వివిధ రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నట్టు ఏపీడబ్ల్యూజేఎఫ్ విశాఖ అధ్యక్షుడు పి.నారాయణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సింహగిరిపై ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్ట్ కేంద్రం



అవుట్ పోస్ట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి, సీఐ అశోక్‌కుమార్

సింహాచలం: సింహగిరిపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్ అవుట్ పోస్టు కేంద్రాన్ని గురువారం సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం నుంచి మైకు ద్వారా వాహనాల నియంత్రణ, పార్కింగ్ ప్రదేశాలు, తదితర అంశాలను భక్తులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి జగనన్న అండ

- సంక్షేమ పాలనతో పేదలకు భరోసా
- ప్రజలంతా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌నే కోరుకుంటున్నారు..
- వైఎస్సార్‌సీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు


చింతగట్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న అజయ్‌రాజ్, ప్రజాప్రతినిధులు

పెందుర్తి: నాలుగున్నరేళ్ల సుపరిపాలనలో ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ అన్నారు. కరోనా లాంటి సంక్షోభంలో కూడా సంక్షేమం ఆపకుండా ప్రతీ పేద కుటుంబానికి చేదోడుగా ఉన్నారన్నారు. పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' అనే కార్యక్రమాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలనతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. ఆయన ప్రతినిధులుగా తాము ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు ఎంతో సంతోషంగా ఆహ్వానిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సంక్షేమ పాలన సాగాలని.. రాష్ట్రానికి మళ్లీ జగనే కావాలని ఆకాంక్షిస్తున్నారని వెల్లడించారు. ఇంటింటికీ ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, మండల సర్పంచ్‌ల సంఘంగా అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మపాలెం సచివాలయం పరిధిలో..

సబ్బవరం: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా వెతికి పట్టుకుని వారిని కూడా సంక్షేమ పథకాలకు చేరువ చేయనున్నట్లు ఎంపీపీ బోకం సూర్యకుమారి తెలిపారు. మండలంలోని బంగారమ్మపాలెం సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా మహిళలకే పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఈ గ్రామంలో సుమారు రూ. 26 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. వీటిలో సుమారు రూ.18 కోట్ల వరకూ లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయన్నారు. గ్రామంలో 1055 కుటుంబాలు ఉండగా వీటిలో 1043 కుటుంబాల వారు ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధి పొందినట్లు తెలిపారు. ఎన్నికల నాటి హామీలను 98 శాతానికి పైగా అమలు చేస్తూ, అత్యంత పారదర్శకంగా పాలన సాగిస్తున్న జగనే మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎంపీపీ తెలిపారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము, ఎంపీడీవో రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు దాడి లావణ్య, పిల్లల అప్పలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, ఈవోపీఆర్‌డీ మహేష్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, రాపేటి రాము, శరగడం రాము, సబ్బవరపు నారాయణమూర్తి, దాడి కన్నంనాయుడు, కోరుబిల్లి నూకరాజు, ఐడీ బాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు బంతికోళ్ల పద్మ, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ అంగటి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- పరవాడలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు


పరవాడలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సుపరిపాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండల కేంద్రం పరవాడలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయనకు ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు స్వాగతం పలికారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ జెండా, సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించిన అనంతరం అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను చదివి వినిపించారు. గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీడీపీ, జనసేన కలిసి మోసపూరిత హామీలతో ప్రజల ముందుకు వస్తున్నాయని, వాటిని నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ బండారు రామారావు, పార్టీ సీనియర్ నాయకులు కాసు అంజిరెడ్డి, ఇళ్ల ప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, పోతల అప్పలనాయుడు, సిరపరపు రాజేష్, మండల వ్యవసాయాధికారి సిహెచ్.చంద్రావతి, ఎంఈవో సాయిశైలజ, ఏఈలు శేషసాయి, ఎం.ఎస్.ఎన్.రెడ్డి, షన్ముఖ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీనివాసనగర్‌లో జెడ్సీ ఆకస్మిక పర్యటన


నీటి నిల్వలను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలోని శ్రీనివాసనగర్‌లో గురువారం జోన్–8 కమిషనర్ మల్లయ్యనాయుడు ఆకస్మికంగా పర్యటించారు. వార్డులో శానిటేషన్ ఎలా ఉందో.. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధుల్లో ఉన్నారా.. కార్మికులు సమయానికి వచ్చి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారా.. లేదా.. అన్న విషయాలపై ఆరా తీశారు. కాలువలో చెత్తాచెదారం కనిపించడం, మురుగు నిల్వ ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే కార్మికుల చేత వాటిని తొలగించారు. పారిశుద్ధ్య పనుల్లో జాప్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నివాసులతో జెడ్సీ మాట్లాడి తడి చెత్త–పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. వాటిని సేకరించడానికి మెరుగైన సేవలు అందించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు సూచించారు. నివాసుతులంతా స్వచ్ఛందంగా వచ్చి యూజర్ చార్జీలను చెల్లించాలని కోరారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జెడ్సీ మల్లయ్యనాయుడు సూచించారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఘనంగా స్వర్ణ తులసీదళార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవీలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. స్వర్ణ తులసీ దళాలతో ఉభయదాతలచే ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ చేస్తూ 108 స్వర్ణతులసీ దళాలతో అర్చన జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విశేషంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవీలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.


మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో దేశపాత్రునిపాలెం ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం, శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేశపాత్రునిపాలెం, శేషాద్రినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఎంవీఆర్‌లో 'సైఫెస్టా - 2కే23' ప్రారంభం

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో సైఫెస్టా - 2కే23 ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులలో వినూత్నమైన ఆలోచనలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సైఫెస్టా–2కే23 ఉద్దేశాన్ని ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పి.వి.డి.సౌజన్య కుమారి ఈ సందర్భంగా వివరించారు. ఈ ఫెస్ట్‌లో నగరానికి చెందిన 15 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి వర్తకులకు సహకరిస్తాం

- దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి


వర్తకులతో మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరి వర్తకులకు పూర్తిగా సహకరిస్తామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రసాద్ స్కీమ్ పథకంలో భాగంగా సింహగిరిపై ప్రస్తుతం ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించి నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక వేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా వర్తకులందరికీ తాత్కాలికంగా పాదాలమ్మ, బంగారమ్మ ఆలయాల సముదాయంలో షాపులు నిర్మించేందుకు అధికారులు పూనుకున్నారు. ఆ ప్రదేశంలో షాపుల ఏర్పాటుకు సంబంధించి చేసిన మార్కింగ్ పనులను ఈవో గురువారం పరిశీలించారు. వర్తకులు, వర్తక సంఘం నాయకులతో మాట్లాడారు. సింహగిరినే నమ్ముకుని తరతరాలుగా వ్యాపారాలు చేసుకుంటున్న వర్తకులకు ఎప్పుడూ దేవస్థానం సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. కొత్తగా నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆధునిక వసతులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వర్తకులు అధికారులకు పలు సూచనలు చేశారు. తాత్కాలికంగా నిర్మించే షాపులన్నీ ఒకే కొలతతో ఉండాలని, వలయాకారంలో షాపులు నిర్మిస్తే వర్తకులకు మేలు జరుగుతుందన్నారు. వర్షం వస్తే నీరు షాపింగ్ కాంప్లెక్స్‌లోకి రాకుండా చూడాలని, వీలైనంత తొందరగా కొత్త షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ముదుండి రాజేశ్వరి, సువ్వాడ శ్రీదేవి, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈ హరి, సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు, వర్తక సంఘం అధ్యక్షుడు ఎం. కిరణ్, ఉపాధ్యక్షుడు సానబోయిన రాజు, మాజీ అధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వర్తకులు కస్తూరి సత్తిబాబు, బంటుబిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


అడవివరం గ్రంథాలయ భవనం


గ్రంథాలయాధికారి నరసింహం

సింహాచలం : ఈనెల 14వ తేదీ నుంచి అడవివరం గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం గురువారం తెలిపారు. 14న గ్రంథాలయ భవనంలో మువ్వన్నెల జాతీయ పతాకం ఆవిష్కరణతో వారోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆ రోజు బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. 15న గ్రంథాలయ ఉద్యమ నేతల సంస్మరణ కార్యక్రమం, 16న యువతకు ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తూ యువజన సదస్సు నిర్వహణ ఉంటుందన్నారు. 17న సాహిత్య సమావేశం, 18న పుస్తక ప్రదర్శన, సభ్యత్వ సేకరణ, 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతపై అవగాహన సదస్సు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. 20న వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. గ్రామస్తులు, పాఠకులు వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వారోత్సవాల సందర్భంగా గతంలో గ్రంథాలయం నుంచి సభ్యులు ఇళ్లకు తీసుకెళ్లి దీర్ఘకాలంగా తిరిగి ఇవ్వని పుస్తకాలపై అపరాధ రుసుము మినహాయింపు ఇస్తామని, పుస్తకాలను తిరిగి గ్రంథాలయానికి అప్పజెప్పాలని కోరారు.

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని నిర్వాసితుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గంగవరం పోర్టు వంతెన వద్ద గల గాంధీ విగ్రహం వద్ద గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఉద్యమాలు చేసినా కేంద్ర ప్రభుత్వంలో చలనం రావడం లేదన్నారు. కేంద్రప్రభుత్వం దిగి వచ్చి తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. నిర్వాసిత కాలనీలు పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి, అగనంపూడి నుంచి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ కార్డుదారులకు శాశ్వత ఉపాధి కల్పించే వరకూ పోరాటాలు చేయాలన్నారు.



డిసెంబర్‌లో కోటి ఒత్తుల దీపోత్సవాలు

సింహాచలం: విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 8,9,10 తేదీల్లో సింహాచలంలో కోటి ఒత్తుల దీపోత్సవాలు నిర్వహిస్తున్నట్టు విశాఖకు చెందిన హిమాలయ సార్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి తెలిపారు. సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద కార్యక్రమాల వివరాల కరపత్రాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌యోగి మాట్లాడుతూ సర్వజనులు సుఖశాంతులతో ఉండాలన్నా...ఆనందంతో జీవించాలన్నా సనాతన ధర్మం ఒక్కటే మార్గమని తెలిపారు. సనాతన భారతీయ ధర్మాన్ని రక్షించుకునే క్రమంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వద్ద, హవేలీ గ్రౌండ్‌వద్ద, వరాహపుష్కరిణి వద్ద కోటి ఒత్తుల దీపోత్సవ మహోత్సవాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. డిసెంబర్ 8న నగరంలోని జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం నుంచి సింహాచలంలోని తొలిపావంచా వరకు భారీ ఎత్తున భారీకలశ యాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విరాట్ హిందూ సంఘ్ ప్రతినిధులు మీసాల రవీంద్ర, పూడిపెద్ది శర్మ, నమ్మి రాజగోపాల్, భీశెట్టి నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, ఆర్.జయరాజ్, బూరాడ సాయి రోజా, జ్యోతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సార్య పీఠాధిపతి ప్రభాకర్ యోగి, సభ్యులు

సామాజిక సాధికార యాత్రకు ర్యాలీగా..


లంకెలపాలెం కూడలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న బైక్‌యాత్ర

అగనంపూడి: అనకాపల్లిలో నిర్వహించిన సామాజిక సాధికారిక యాత్రలో పాల్గొనేందుకు లంకెలపాలెం, ఫార్మాసిటీ కాలనీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు గొన్నా హేమచంద్ నాయుడు ఆధ్వర్యంలో వంద బైక్‌లతో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా లంకెలపాలెం మీదుగా అనకాపల్లి వెళ్తున్న మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ నేటి సామాజిక సాధికార యాత్ర వచ్చే సాధారణ ఎన్నికల విజయ యాత్రగా మారనుందన్నారు. యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట చర్యలతోనే రైల్వే భద్రత

కంచరపాలెం: రైల్వే భద్రత అంశాలపై ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో గురువారం కంచరపాలెం బొట్టా నర్సింగరావు భవనంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సి.జేమ్స్ మాట్లాడుతూ ఇటీవల కేపీఎల్–ఏఎల్ఎం సెక్షన్ మధ్య పలాస–రాయగడ ప్యాసింజర్‌లు ఢీకొన్న సంఘటన అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ విషాద ఘటన తర్వాత రైల్వేలో భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన రైల్వే ఉద్యోగులతోపాటు ప్రయాణికులకు సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గల కారణాలేమిటో కాకుండా.. ఎవరు బాధ్యులన్న ఉద్దేశంతో రైల్వే అధికారులు ప్రమాదాలపై ఆరా తీస్తున్నారన్నారు. జోనల్ అధ్యక్షుడు ఎస్.కె.చౌబే, కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ సేఫ్టీ కేటగిరీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడంతో సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు రైల్వే యంత్రాంగం, ప్రభుత్వం వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కుమార్, జగన్ తదితరులు ప్రసంగించారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

మల్కాపురం: గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను 61వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంత గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరీ పరమేశ్వరులను మల్కాపురం సేవా మార్గం నుంచి ప్రకాష్‌నగర్ వరకు ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. సేవ గరడి, కోలాట ప్రదర్శన నడుమ గౌరీ పరమేశ్వరులను ప్రకాష్‌నగర్ వద్ద గల గౌరీదేవి మందిరం వద్ద నెలకొల్పి పూజలు జరిపారు.


గౌరీపరమేశ్వరులు